సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 13 । జనవరి । 2023



క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి విరాళం

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.నుగుణారెడ్డి రూ.3లక్షలు విరాళం అందజేశారు.



ద్వారపూడి వస్త్ర మార్కెట్ డీలా

ద్వారపూడి వస్త్రమార్కెట్‌లో అమ్మకాలు డీలా పడ్డాయి. ఆన్‌లైన్, షాపింగ్‌మాల్స్ ప్రభావంతో మార్కెట్‌లో అమ్మకాలు సగానికి పైగా తగ్గిపోయాయి.

II లో

డెల్టాలకు 9,300 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,750, పశ్చిమ డెల్టాకు 4,900 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.65 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్యాకేజీ స్టార్‌కు పిచ్చిముదిరింది

మంత్రి అమర్‌నాథ్

రాజానగరం: ప్యాకేజీ స్టార్‌కు పిచ్చిముదిరిందని, సీఎం జగన్, ఇతర మంత్రులపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాజానగరం మండలం పాలచర్లలో గురువారం జరిగిన స్పోర్ట్సు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తీరు చూస్తుంటే పిచ్చి పతాక స్థాయికి చేరుకుందని పిస్తోందన్నారు. ఆయనను వైద్యుడికి చూపిస్తే బాగుంటుందన్నారు. ప్రశ్నించడానికి పార్టీ పెట్టానని చెప్పిన ఆయన.. పాలకులను తిట్టడానికే పుట్టినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఒకవైపు ఒంటరిగా పోటీ చేస్తే వీర మరణం తప్పదంటాడు..మరోవైపు పొత్తులంటూ వైఎస్సార్ సీపీ తప్ప అన్ని పార్టీలతోను జతకడతానంటాడు.. దేనిలోని పరిపక్వత లేకుండా చంద్రబాబు చెప్పినట్టు తలాడిస్తున్నాడన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసమే నటిస్తుంటే ఆ ప్యాకేజీ తీసేసుకో, అంతేగాని జనాన్ని మోసం చేయవద్దని మంత్రి హితవు పలికారు. వచ్చే ఎన్నికలలో అధికారం తమ పార్టీదేనని స్పష్టం చేశారు.

పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయండి: రాజా



కలెక్టర్ మాధవీలతకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కార్మిక సంఘ నేత, యాజమాన్య ప్రతినిధి కుమ్మక్కు కావడంతో పలు విధాలుగా నష్టపోతున్న ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జిల్లా కలెక్టర్ మాధవీలతను కోరారు. ఆయన గురువారం మిల్లు కార్మిక సంఘాల నేతలతో కలిసి కలెక్టర్‌ను కలుసుకున్నారు. ఉద్యోగ నియామకాల పరంపరలో సీనియర్ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు జరుగుతున్న అన్యాయాలను రాజా వివరించారు. యాజమాన్య ప్రతినిధి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అక్కినేని జయకృష్ణ, కార్మిక సంఘ నేత చిట్టూరి ప్రవీణ్ చౌదరి కలిపి కార్మికులకు నష్టం కలిగే చర్యలు తీసుకుంటున్నారన్నారు. అన్ని విషయాలను పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రాజా వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి అరుణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు,పేపర్ మిల్ స్టాఫ్ అండ్ వర్కర్ యూనియన్ ప్రెసిడెంట్ కాసే రాజేష్ వివిధ సంఘాల కార్మిక నేతలు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాల పరిధిలో 2022 సంవత్సరానికి గాను స్కూల్ అసిస్టెంట్లుగా (లెక్కలు, ఇంగ్లిషు, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ సబ్జెక్టు) పదోన్నతి పొందడానికి సుముఖత తెలిపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం గురువారం ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేట హెడ్ పోస్టాఫీసు పక్కన గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుంది. సమ్మతి తెలిపిన ఉపాధ్యాయులందరూ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

భోగిళ్లలో సందళ్లు

- దూర ప్రాంతాల నుంచి చేరుకుంటున్న చుట్టాలు
- కొత్త అల్లుళ్లకు ఆతిథ్యం పలుకుతున్న లోగిళ్లు
- ఏ రోడ్డు చూసినా వాహనాలతో కిటకిట
- మధురపూడి ఎయిర్‌పోర్టులో పెరిగిన ట్రాఫిక్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంక్రాంతి పండగకు తల్లి వంటి సొంతూరుకు జనం రెక్కలు కట్టుకుని వాలిపోతున్నారు. పెద్ద పండగగా పిలిచే సంక్రాంతికి చుట్టాల రాక అప్పుడే మొదలైపోయింది. గ్రామాల్లో వీరందరికీ ఆతిథ్యం పలుకుతున్న సందడి కనిపిస్తోంది. ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. వాకిళ్లను అలికి, గొబ్బెమ్మలు, చుక్కల ముగ్గులతో అలంకరిస్తున్నారు. ఇప్పటికే చాలా ఇళ్లలో గోడలకు సున్నాలు వేశారు. మరోపక్క బంధుగణం కోసం పిండి వంటలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏ పల్లె చూసినా, ఏ ఇంటిని కదిపినా పండగ ఊసులే,.. పిండి వంటలఘుమఘుమలే..తెలుగింటి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండగ జరుపుకోవడంలో జిల్లా పెట్టింది పేరు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే ప్రభల తీర్థాలు, గ్రామ దేవతల జాతరలు, సంప్రదాయ క్రీడలు, కోడిపందేలు తదితర వేడుకలు తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ప్రవాసాంధ్రులు కూడా పల్లెబాట పడుతున్నారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండగ కావడంతో వ్యవసాయ కుటుంబాల్లో ఆనందం కనిపిస్తోంది. ఏడాది పొడవునా వివిధ రూపాల్లో తమకు సేవలందించే కులవృత్తుల వారికి రైతులు పండగలో భాగంగా ధాన్యం, నగదు రూపంలో కానుకలిచ్చి అభిమానాన్ని చాటుకుంటున్నారు.

సెలవులతో ప్రయాణాల జోరు

పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 12 నుంచి పండగ సెలవులు ప్రకటించింది. దీంతో పిల్లాపాపలతో తమకు వీలున్న వాహనాల ద్వారా సొంత ఊళ్లకు ప్రజలు చేరుకుంటున్నారు. నాలుగు రోజుల పాటు ఆబాల గోపాలాన్ని అలరించే పండగల కోసం విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం దూరంగా ఉన్న వారు ఎన్ని పనులున్నా మానుకుని స్వగ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో రైళ్లు, బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. రెండు నెలలు





రాజమహేంద్రవరంలో బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



లగేజీతో ప్రయాణానికి వడివడిగా..



ముందుగానే రైళ్లన్నీ రిజర్వేషన్‌తో ఫుల్ అయిపోయాయి. ఆర్టీసీ బస్సులకూ డిమాండ్ బాగానే ఉంది. పాతకు స్వస్తిపలికి కొత్తదనానికి నాంది పలికే భోగి పండగ కోసం పిల్లలు ఉవ్విళ్లూరుతున్నారు. భోగిమంటల సంస్కృతి కనుమరుగైపోతుందని కొందరు బాధపడుతున్నా భోగి పిడకల దండల హడావుడి మాత్రం అక్కడక్కడా కనిపిస్తోంది. కోనసీమలో ఈ సందడి ఎక్కువగా ఉంది. కోనసీమలో పండగకు ప్రత్యేకత ప్రభల తీర్థం. ఈసారి రిపబ్లిక్ డే వేడుకల్లో కూడా ప్రభల శకటానికి చోటు లభించడం విశేషం. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు ప్రభల తీర్థాన్ని తిలకించేందుకు అమితాసక్తి కనబరుస్తారు.

ఆర్టీసీ బస్సులన్నీ ఫుల్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వేలాది కుటుంబాలు ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడతో పాటు బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో ఉంటున్నాయి. దుబాయ్, మస్కట్, కువైట్ లాంటి గల్ఫ్ దేశాలే కాదు అమెరికా లాంటి దేశాల్లో ఉంటున్న వారూ కొందరు సంక్రాంతికి సొంతూరు చేరేందుకు ముందస్తు ప్రణాళిక వేసుకున్నారు. ఇలాంటి వారంతా ఒకేసారి బయలుదేరి స్వదేశానికి చేరుకుంటున్నారు. మరోపక్క రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లు ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 14 సర్వీసులు హైదరాబాద్‌కు నడుస్తున్నాయి. బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, ఈసీఎల్ తదితర ప్రాంతాల నుంచి బుధవారం 10, గురువారం 14 బస్సులు నడపగా, శుక్రవారం వెళ్లే 13 బస్సులలో సీట్లన్నీ ఫుల్ అయిపోయాయి. హైదరాబాద్ నుంచి కాకినాడకు గురువారం 10 బస్సులు వెళ్లాయి. శుక్రవారం వెళ్లే ఎనిమిది బస్సులలో ఒక్క సీటు కూడా ఖాళీ లేదు. హైదరాబాద్ నుంచి కోనసీమ జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, రావులపాలెం డిపోలకు గురువారం 25 బస్సుల్లో జనం తరలివచ్చారు. శుక్రవారం కోనసీమకు వచ్చేందుకు 23 బస్సుల్లో సీట్లన్నీ రిజర్వు అయిపోయాయి.

ఎయిర్‌పోర్టులోనూ రద్దీయే..

మధురపూడి ఎయిర్ పోర్టులో పండగ కళ ఉట్టిపడుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సొంతూరికి పయనమవ్వడంతో మధురపూడి ఎయిర్‌పోర్టులో గడచిన రెండు రోజులుగా ట్రాఫిక్ పెరిగింది. గతేడాది జనవరిలో (ఏడో తేదీ నుంచి 14వరకు) పండగ సమయంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల నుంచి 2,600 మంది ఉమ్మడి జిల్లాల్లో స్వస్థలాలకు వచ్చారు. ఈసారి ఈ నెల 12 వరకు 3,600 మంది రావడం విశేషం. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖకు డైలీ ఈ ఎయిర్‌పోర్టు నుంచి 22 సర్వీసులు తిరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో ఒక విమాన సర్వీసు 55 మందితో వెళుతోంది. సంక్రాంతి కావడంతో 68 నుంచి 72 మంది ప్రయాణిస్తుండటంతో ఎయిర్‌పోర్టులో ట్రాఫిక్ పెరిగింది.

పండగంటే కొత్త వస్త్రాలే..

సంక్రాంతి సీజన్‌లో వస్త్రాల షాపింగ్‌ది ప్రత్యేక స్థానం. నగరాలు..పట్టణాల్లోని షాపింగ్‌మాల్స్, రడీమెడ్ దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. వస్త్ర వ్యాపారానికి పేరొందిన రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం బ్రాండెడ్ షోరూంలు కళకళలాడుతున్నాయి. పేరెన్నికగన్న ద్వారపూడి మార్కెట్ మాత్రం ఈసారి కాస్త డీలా పడింది. సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.1,000 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయని వాణిజ్య వర్గాల అంచనా. ఆ అంచనాలు అందుకుంటామనే ధీమా వ్యాపారుల్లో కనిపిస్తోంది.



హైదరాబాద్‌కు చెందిన ప్రణీత్‌గ్రూప్ డైరెక్టర్ పాతపాటి రామాంజనేయరాజు ఆత్రేయపురంలో చిన్ననాటి స్నేహితులు, కుటుంబ సభ్యులతో..



సొంతూరుకు రావడం మధురానుభూతి



మాది ఆత్రేయపురం. హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. ప్రణీత్ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్నాను. ఏటా ఎన్ని పనులున్నా సంక్రాంతికి కుటుంబ సమేతంగా స్వస్థలానికి వస్తుంటాం. ఈ ప్రాంతానికి రాగానే తెలియని మధురానుభూతి కలుగుతుంది. చిన్ననాటి స్నేహితులందరినీ కలిసే అవకాశం. బాల్యమంతా మరోమారు గుర్తుకు తెచ్చేందుకు ఈ పండగ ఒక వేదిక అనుకుంటాను. నాలుగు రోజులు అందరితో కలసి భోజనాలు చేయడం..రకరకాల పోటీలు నిర్వహించడం ఆనవాయితీ.

– పాతపాటి రామాంజనేయరాజు, హైదరాబాద్

ఎక్కడున్నా మా ఊరు రావల్సిందే



మేం ఎక్కడ ఉన్నప్పటికీ సంక్రాంతికి మా ఊరు మల్కిపురం రెక్కలు కట్టుకుని వాలిపోతాం. ఊరులో చిన్ననాటి స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఈ నాలుగు రోజులు ఆనందంగా గడుపుతాం. సంక్రాంతి సందర్భంగా వివిధ పోటీలలో సరదాగా పాల్గొంటాం. కుటుంబ సభ్యుల మధ్య ఉత్సాహంగా గడిపేందుకు ఈ పండగ ఎంతగానో దోహదపడుతుంది. 24 గంటలూ విధులతో బిజీబిజీగా ఉండే మేము సంక్రాంతి పర్వదినం పేరుతో నాలుగు రోజులు ప్రశాంతంగా ఉంటాం.

– కొణిదల రవితేజ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, విశాఖపట్నం

ఎయిర్‌పోర్టుకు సంక్రాంతి కళ



ఎయిర్‌పోర్టుకు ఈసారి సంక్రాంతి పండగ కలసి వచ్చింది. గత ఏడాది కంటే ఈసారి ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయ్యింది. ఈ నెల ఒకటి నుంచి 12వ తేదీ వరకు అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నాలకు 13 విమానాలు, 22 సర్వీసులు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 3,600 మంది ఇక్కడి జిల్లాలకు వచ్చారు.

– ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్, మధురపూడి

పౌష్టికాహారం సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పౌష్టికాహార లోపమున్న కౌమార బాలికలు, గర్భిణులు, పిల్లల విషయంలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టరు మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గురువారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక్కడి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లా పురోగతి వివరించారు. పౌష్టికాహార లోపమున్న 23,932 మందిని గుర్తించి నూరు శాతం పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. 4,027 మందికి వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. బడి బయట పిల్లల గురించి ప్రస్తావిస్తూ ప్రాథమిక పాఠశాల పరిధిలో తొలిదశలో 235 మందిని.. ఉన్నత పాఠశాలల్లో 652 మందిని బడి బాట పట్టించామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్టు కింద హైరిస్కు ఉన్న 23 మందిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కోవిడ్‌కు సంబంధించి జిల్లాలో రూ.276 లక్షల పరిహారాన్ని అందించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత హెచ్చరించారు. 'కోడి పందేలు నిర్వహించడం – పాల్గొనడం చట్టరీత్యా నేరం' అనే ప్రచారాన్ని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జంతుహింసను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన 17 మందితో ఒక కమిటీని గత ఆగస్టులో ఏర్పాటు చేశామన్నారు. జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడానికి ఏర్పాటు చేసిన కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ అధ్యక్షతన జెడ్పీ సీఈవో, జిల్లా ఎస్పీ, పశుసంవ ర్ధక శాఖ, డీపీఆర్‌వో, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కూడిన కమిటీ పనిచేస్తుందన్నారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై గేమింగ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 10 కింద, జంతుహింస నివారణ చట్టం 1960 సెక్షన్ 34 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు చర్యలు



డిస్పెన్సరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, మార్గాని భరత్ రామ్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఈడీ వెంకటేశ్వరరావు

- చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు
- రాజమహేంద్రవరంలో డిస్పెన్సరీ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. రాజమహేంద్రవరంలో రూ.46 లక్షలతో నిర్మించిన ఆర్టీసీ డిస్పెన్సరీని గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ భరత్ రామ్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు. ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచీ ఆర్టీసీకి మంచి రోజులు వచ్చాయన్నారు. ఆ సమయంలో ఆర్టీసీని సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు రూ.500 కోట్లు ఇచ్చారన్నారు. తదుపరి పాలకులు ఆర్టీసీని నిర్లక్ష్యం చేశారన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా


ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు జగన్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న ఈ రోజుల్లో.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చి, వారి కుటుంబాలకు భరోసా ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ నూతనంగా బస్సులను అందించి, ఆర్టీసీలో ప్రయాణంపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని తీసుకువచ్చారన్నారు.

ప్రయాణికుల సంక్షేమం

ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికుల సంక్షేమం కోసం కృషి చేస్తూ.. సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. గతంలో పండగ సీజన్‌లో 50 శాతం అధిక ధరలు నిర్ణయించేవారని, సీఎం జగన్ పాలనలో ఆ విధంగా ఎటువంటి ధరలు పెంచలేదన్నారు. హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యేక డిస్పెన్సరీ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రతినెలా వంద రూపాయల విరాళాలతో రూ.30 కోట్లు సమకూర్చుకుని విజయవాడలో ఆధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించుకున్నామన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఇప్పటి వరకూ 350 మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, సంకిస భవానీ ప్రియ, ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, కొవ్వూరు మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ బావన రత్నకుమారి, పిల్లి నిర్మల, డీపీటీఓలు ఆర్‌వీఎస్.నాగేశ్వరరావు, షర్మిలా అశోక్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం పాల్గొన్నారు.

వినియోగదారుల చేతికి బ్రహ్మాస్త్రం

- ఇక పౌరసరఫరా, తూనికలు, కొలతల శాఖల్లో మోసాలకు చెక్
- టోల్‌ఫ్రీ నంబర్లను అనుసంధానిస్తూ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటు
- 1967 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం



రాజమహేంద్రవరం రూరల్: గుండు సూది నుంచి గూగుల్ సేవల వరకు, పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకు, రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈ–కామర్స్ సంస్థల దోపిడీ వరకు ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా..వస్తువుల్లో నాణ్యతా లోపించినా వినియోగదారులు ఏమి చేయలేని పరిస్థితి. అలాంటి వారి చేతికి రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మాస్త్రం అందిస్తోంది. ఫిర్యాదులు, వినతులు, సలహాలు కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. 1967 నంబర్‌ను రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సమస్యలను పరిష్కరించేందుకు వివిధ టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాలశాఖకు సంబంధించి 18004250082/1967, ఒకే దేశం, ఒకే రేషన్‌కార్డు ఫిర్యాదులకు 18004253157/14445, రాష్ట్ర ఆహారభద్రత ఫిర్యాదుల, సలహాలు, సూచనలు చేసుకునేందుకు 18004252388/155235, తూనికలు, కొలతలశాఖకు సంబంధించిన ఫిర్యాదులు కోసం 18004254205 టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి చేయడానికి బదులు మరోశాఖకు వెళ్లేవి. అంతేకాక వినియోగదారులు అన్ని నంబర్లుకు గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్‌ఫ్రీనంబర్లును అనుసంధానం చేస్తూ 1967 అనే నంబర్‌తో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలశాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులను చేయవచ్చు. ముఖ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో తూకాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికల కొలతల అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. అదేవిధంగా సలహాలు, సూచనలు ఇవ్వచ్చు. చేసిన ఫిర్యాదును సంబంధింత శాఖల పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేకాక నిర్దేశించిన సమయం తరువాత ఫిర్యాదు ఏ దశలో ఉన్నదో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నదో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను 1967 నంబర్‌తో ఏర్పాటు చేసింది. బుధవారం నుంచి కాల్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.ప్రజలు సద్వినియోగం చేసుకుని అక్రమాలను అరికట్టవచ్చు.

–ఎన్.తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్

క్లుప్తంగా

బెస్ట్ విమెన్ వెయిట్ లిఫ్టర్‌గా ధాత్రి



ధాత్రి

రాజానగరం: అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ విమెన్ చాంపియన్ షిప్ పోటీలు, యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో గురువారం ప్రారంభమయ్యాయి. పదిరకాల వెయిట్ కేటగిరీలలో పోటీలు నిర్వహించగా, గోదావరి జిల్లాలలోని అనుబంధ కళాశాలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కాకినాడ) టీమ్ చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకుంది. బెస్ట్ విమెన్ వెయిట్ లిఫ్టర్‌గా వీఎస్ లక్ష్మీ విమెన్స్ డిగ్రీ కళాశాల (కాకినాడ) విద్యార్థిని పి.ధాత్రి నిలిచింది. విమెన్ అండ్ మెన్‌ల నుంచి యూనివర్సిటీ టీమ్‌కి 19 మందిని ఎంపిక చేశారు. వీరు త్వరలో జరుగనున్న ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటారు. బెస్ట్ విమెన్ వెయిట్ లిఫ్టర్‌తోపాటు ఎంపికైన 19 మంది క్రీడాకారులను ఓఎస్‌డి ఆచార్య ఎస్.టేకి అభినందించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.రామ్‌గోపాల్, సెలెక్షన్ కమిటీ సభ్యులు బడేటి వెంకటరామయ్య, సూరిబాబు, డాక్టర్ కె.బాలసత్యనారాయణ, డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి, దేవానంద్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, అన్వర్ బాషా, కోచ్‌లు రమేష్, సతీష్, లోహిత్ పాల్గొన్నారు.

ద్వారపూడి వస్త్ర మార్కెట్ డీలా

- ఆన్‌లైన్, మాల్స్ వైపు వినియోగదారుల మొగ్గు
- సగానికి తగ్గిన అమ్మకాలు
- వెలవెలబోతున్న దుకాణాలు

మండపేట: ద్వారపూడి వస్త్రమార్కెట్‌లో అమ్మకాలు డీలా పడ్డాయి. ఆన్‌లైన్, షాపింగ్‌మాల్స్ ప్రభావంతో మార్కెట్‌లో అమ్మకాలు సగానికి పైగా తగ్గిపోయాయి. సంక్రాంతి సీజన్‌లో కిక్కిరిసి కనిపించే క్లాత్, రెడీమేడ్ షాపులు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. పండగల వ్యాపారంపై గంపెడాశతో ఎదురుచూసిన వ్యాపారులకు ఆశించిన స్థాయిలో లేని అమ్మకాలు నిరాశను కలిగిస్తున్నాయి.

నాటు కిటకిట.. నేడు కటకట

మండలంలోని ద్వారపూడిలోని వస్త్ర మార్కెట్ హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలకు రాష్ట్రవ్యాప్తంగా పేరొందింది. 338 షాపులతో పాటు 350 వరకు ప్లాట్‌ఫాం దుకాణాలు ఉన్నాయి. బళ్లారి, ఈరోడ్, కోల్‌కతా, చెన్నై, ముంబయి, ఢిల్లీ, సూరత్ తదితర ప్రాంతాల నుంచి క్లాత్, రెడీమేడ్ దుస్తులు తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు చేస్తుంటారు. సామాన్య, మధ్యతరగతి వర్గాల వారికి అందుబాటు ధరల్లో అన్ని రకాల వస్త్రాలు ఇక్కడ లభ్యమవుతాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి తదితర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి హోల్‌సేల్ వ్యాపారులు ఇక్కడి నుంచి కొనుగోళ్లు చేస్తుంటారు. సాధారణ సంత రోజుల్లో రోజుకు రూ.నాలుగు నుంచి రూ. ఐదు కోట్ల వ్యాపారం జరిగితే సంక్రాంతి సీజన్‌లో రూ.20 కోట్లకు పైగా అమ్మకాలు జరుగుతాయని అంచనా. క్లాత్ షాపులు, ప్లాట్‌ఫాం దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించేవి.



ద్వారపూడి క్లాత్ మార్కెట్



వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న ఫ్లాట్‌ఫాం షాపులు

ఇదంతా గతంగానే మిగిలింది.

పడిపోయిన ఎగుమతులు

జీఎస్టీ ప్రభావంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. ఆన్‌లైన్ వ్యాపారం జోరు, మరో పక్క రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో వెలిసిన భారీ షాపింగ్‌మాల్స్ ద్వారపూడి వస్త్రమార్కెట్‌తో పాటు ఇతర క్లాత్‌షాపులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి.

కొనుగోలు చేసిన వస్తువులు నచ్చకపోతే రిటర్న్ చేసుకునే వీలుండటం, క్యాష్ ఆన్ డెలివరీ సదుపాయం, రకరకాల మోడల్స్ అందుబాటులో ఉండటంతో యువత ఆన్‌లైన్ షాపింగ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. మరోపక్క షాపింగ్‌మాల్స్ ఆకర్షణీయమైన ఆఫర్స్ ప్రకటిస్తున్నాయి. సిటీకి వెళితే సంక్రాంతి పండగలకు అవసరమైన షాపింగ్ మొత్తం అక్కడే చేసేయ్యొచ్చన్న భావనలో వినియోగదారులు నగరాల్లోని షాపింగ్‌మాల్స్‌కు క్యూ కడుతున్నారు. ఆయా కారణాలతో క్లాత్ మార్కెట్ వ్యాపారం గణనీయంగా తగ్గిపోయింది. ఈ సీజన్‌లో 50 శాతం మేర అమ్మకాలు తగ్గిపోయాయని వ్యాపారులు అంటున్నారు. కొనుగోలుదారులు లేక షాపులు వెలవెలబోతున్నాయి. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉండగా పెద్ద పండగకైనా కలిసొస్తుందని ఆశిస్తే నిరాశే ఎదురైందని వారంటున్నారు. పండగల కోసం పెట్టుబడులు పెట్టి తెచ్చిన స్టాకులు మిగిలిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని వాపోతున్నారు.

గతంలో ఇలాంటి పరిస్థితి చూడలేదు



ఈ సీజన్‌లో అమ్మకాలు వ్యాపారులకు చాలా నిరాశను కలిగించాయి. ఆన్‌లైన్ వ్యాపారం, షాపింగ్‌మాల్స్ క్లాత్ మార్కెట్ వ్యాపారంపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ద్వారపూడి క్లాత్ మార్కెట్‌లో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు.

– చిక్కాల శ్రీనివాసరావు, క్లాత్ మార్కెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ద్వారపూడి

50 శాతం మేర అమ్మకాలు తగ్గిపోయాయి



సంక్రాంతి సీజన్‌లో జరిగే అమ్మకాల్లో ఈసారి 50 శాతం కూడా జరగలేదు. క్రిస్మస్, నూతన సంవత్సరం అమ్మకాలు అంతంతమాత్రమే. పండగ కోసం తెచ్చిన స్టాకులు చాలా వరకు మిగిలిపోయాయి. హోల్‌సేల్ వ్యాపారం కూడా బాగా తగ్గింది.

– సాపిరెడ్డి శ్రీనివాస్, హోల్‌సేల్ వ్యాపారి, ద్వారపూడి

టైరు పేలి.. రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- ఇద్దరు యువకులకు గాయాలు
- భార్యాభర్తల పరిస్థితి విషమం



గాయపడ్డ దంపతులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లజర్ల: స్థానిక జగన్నాథపురం బస్‌షెల్టర్ సమీపంలో గురువారం ఉదయం దేవరపల్లి వైపు నుంచి విజయవాడ వెళ్తున్న చిన్నకారు టైరు పేలి అదుపుతప్పి ఆ కారుకు ముందు వెళ్తున్న రెండు బైక్‌లను ఢీకొంది. ఈ ఘటనలో నల్లజర్లకు చెందిన మరీదుశివ, కొవ్వూరి దేవిడ్‌రాజు గాయపడ్డారు. మరో బైక్‌పై వెళ్తున్న భార్యభర్తలు, ఇద్దరు చిన్నారులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ఆ చిన్నారులు ఇద్దరికి నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు. భార్యాభర్తల పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.



రాజమహేంద్రవరంలో ఫిబ్రవరి 11వ తేదీన జరిగే తన కుమారుడు నిఖిల్‌కృష్ణ–దివ్యల వివాహానికి విచ్చేయాల్సిందిగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. కుటుంబ సమేతంగా గురువారం తాడేపల్లి వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వివాహ పత్రికను అందజేశారు.

– కాకినాడ

మహిళల్లో హాసిని... పురుషుల్లో బాలకృష్ణ ఫస్ట్

- అమలాపురంలో ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు
- బరువులెత్తి సత్తా చాటిన 110 మంది పవర్ లిఫ్టర్లు

అమలాపురం టౌన్: అమలాపురం గడియారం స్తంభం వేదికగా పవర్ లిఫ్టింగ్ పోటీలు నువ్వా నేనా అన్నట్లుగా గురువారం జరిగాయి. యునైటెడ్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ కాంపిటేషన్ –2023 పేరుతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 110 మంది పవర్ లిఫ్టర్లు ఈ పోటీల్లో పాల్గొని 100 నుంచి 700 కిలోల బరువు వరకూ ఎత్తి తమ ప్రతిభను చాటారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగన ఈ పోటీలు మహిళలు, పురుషులు విభాగాల్లో జరిగాయి. మహిళల విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన ఎం.హాసిని 270 కిలోల బరువు ఎత్తి ప్రథమ విజేతగా నిలిచింది. ద్వితీయ విజేతగా ముమ్మిడివరానికి చెందిన ఎం.శ్రావ్య, తృతీయ విజేతగా అమలాపురానికి చెందిన పి.వందన నిలిచారు. అదే పురుషుల విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.బాలకృష్ణ అన్ని విభాగాల్లో కలిసి 700 కిలోల బరువులు ఎత్తి ప్రథమ విజేత అయ్యారు. జిల్లా ద్వితీయ, తృతీయ స్థానాలను కూడా రాజమహేంద్రవరానికి చెందిన కేవీ వర్ధన్, జి.రవికుమార్ సాధించారు. మొత్తం ఇలా 11 విభాగాల్లో మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించి మొత్తం ఎత్తిన బరువును లెక్కించి విభాగాల వారీగా విజేతలను ప్రకటించారు. జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఫిజికల్ డైరెక్టర్ డీవీ రమణ, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొని బహుమతులు అందజేశారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధి గారపాటి శేఖర్, నగభేరి కృష్ణమూర్తి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ మెమెంటోలు అందజేసి అభినందించింది.



బహుమతులు అందజేస్తున్న జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెంలో రైతు ఈలపోలు భాస్కరరావు పామాయిల్ తోటలో గురువారం ఉదయం గెలలు కోస్తుండగా అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గొడితి నాగరాజు(24) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. నల్లజర్ల పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ రాంబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాత్కాలిక సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు

నాడు పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన సబ్జెక్టు టీచర్లకు నేడు కౌన్సెలింగ్

రాయవరం: ఉపాధ్యాయుల పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం తాత్కాలిక సర్దుబాటులో భాగంగా స్థానాల కేటాయింపునకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. గత నెల 12న ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. అయితే గతంలో పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులతోనే సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ 4వ తేదీ నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఉన్నత పాఠశాలలు, ప్రీ–హైస్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించే చర్యల్లో భాగంగా గతంలో పదోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను తాత్కాలికంగా రూ.2,500 అలవెన్స్ ఇచ్చి సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా తాత్కాలిక సర్దుబాటుకు చర్యలు చేపట్టారు. సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు ఈ నెల 19న ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

మూడు నెలల క్రితం పదోన్నతులు

ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో భాగంగా గతేడాది అక్టోబర్ 12న కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్–2 హెచ్‌ఎం, తెలుగు, హిందీ, పీఈటీలకు పదోన్నతులతో పాటుగా, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు కల్పించిన నాటి నుంచి పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు జరగలేదు. న్యాయపరమైన వివాదాలతో పదోన్నతులు నిలిచిపోవడంతో ప్రభుత్వం సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చేందుకు తాత్కాలిక సర్దుబాటుకు చర్యలు చేపట్టింది. కేవలం సెకండరీ గ్రేడ్ నుంచి గణితం, ఇంగ్లిషు, పీఎస్, బయలాజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టులకు పదోన్నతులు పొందినవారికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పదోన్నతులకు అంగీకారం తెలిపిన గ్రేడ్–2 హెచ్‌ఎం, తెలుగు, హిందీ, పీఈటీలు హాజరుకావాల్సిన పనిలేదు.

నేడు కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

ఎస్‌జీటీ నుంచి సబ్జెక్టు టీచర్లుగా పదోన్నతి పొందిన గణితం 76, బయాలజీకి 53 మంది, సోషల్ సబ్జెక్టుకు 52 మంది, ఇంగ్లిషుకు 177 మంది పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేటలో గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంది. పదోన్నతులకు విల్లింగ్ చూపిన ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. అయితే కౌన్సిలింగ్‌కు గైర్హాజరైన వారికి కూడా పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఖేలో రాజానగరంలో విజేతలు వీరే



క్రికెట్ విన్నర్ పాతనామవరం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి అమర్నాథ్. చిత్రంలో ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జక్కంపూడి గణేష్ తదితరులు

రాజానగరం: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఆయన సోదరుడు జక్కంపూడి గణేష్‌ల పర్యవేక్షణలో 'ఖేలో రాజానగరం' పేరిట నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్టివల్స్ గురువారంతో విజయవంతంగా ముగిశాయి. విజేతలకు పాలచర్లలో జరిగిన ముగింపు సభలో మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వాలీబాల్‌లో గాడాల టీమ్ విన్నర్స్ కాగా నరేంద్రపురం టీమ్ రన్నర్‌గా నిలిచింది. తదుపరి మూడు నుంచి ఆరు వరకు స్థానాలలో రాజానగరం, బొబ్బిల్లంక, గుమ్ములూరు, శ్రీరంగపట్నం టీమ్‌లు నిలిచాయి. కబడ్డీలో కొత్తతుంగపాడు టీమ్ విజేతగా నిలువగా దివాన్‌చెరువు, భూపాలపట్నం, శ్రీరంగపట్నం, కాటవరం, చిన్నకొండేపూడి టీమ్‌లు మిగిలిన స్థానాలలో నిలిచాయి. ఇక క్రికెట్‌లో విన్నర్ పాతనామవరం, రన్నర్ దివాన్‌చెరువు టీమ్‌లు నిలిచాయి. తదుపరి నాలుగు స్థానాలలో నరేంద్రపురం, తోకాడ, పాలచర్ల, నిడిగట్ల టీమ్‌లు నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.60 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు, నాల్గవ బహుమతిగా రూ.10 వేలు, ఐదవ, ఆరవ బహుమతిగా రూ.ఆరు వేలు అందజేశారు.

క్లుప్తంగా

కవితకు ఉత్తమ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

కడియం: తన కవితకు ఉత్తమ పురస్కారం లభించిందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తెలిపారు. మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కవితల పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలో తాను రాసిన 'ప్రమాద గంటికలు' కవిత ఉత్తమ పురస్కారం పొందిందని వివరించారు. ఈ మేరకు గురువారం పెద్దాపురంలో జరిగిన సభలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు జి.ప్రభాకరవర్మ, టి.చక్రవర్తి, జి.నగేష్, బాబు, జోష్యుల కృష్ణ బాబు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నానన్నారు.

అఖిలపక్షంలో బీఆర్ఎస్ జెండా ఏమిటి?



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ జెండా ఏమిటని రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్ ప్రశ్నించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆంధ్రులను దూషించి, ఇప్పుడు తెలంగాణలో ఛీత్కారం పొంది, ఏపీలోకి బీఆర్ఎస్ పేరిట కేసీఆర్ అడుగుపెట్టడాన్ని ఎంతమాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. అఖిలపక్షంలో బీఆర్ఎస్‌ని బహిష్కరించి, కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో కాసాని రాజు, ఏవీఎల్ నరసింహమూర్తి, పెండ్యాల కామరాజు పాల్గొన్నారు.

18 మందికి ఉద్యోగాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధిసంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో తాడితోటలోని జిల్లా ఉపాధి ఉప కార్యాలయంలో గురువారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ తెలిపారు. మరో 14 మందిని షార్ట్‌లిస్ట్ చేశారన్నారు. వాల్‌మార్ట్, డీమార్ట్, పేటీఎం కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

ప్రకాశం నగర్: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న కాకినాడలో నిర్వహించిన ఈ పోటీలో పదిజట్లు పాల్గొన్నాయన్నారు. క్రీడాకారులను పీడీ కిశోర్ బాబు, ఎస్. సాయిరాం, బి.రమణమూర్తి, పీవీ సంజీవరావు, వి.బాల అభినందించారు.

వసతి గదుల ధరలు తగ్గించాలి

సీటీఆర్ఐ: తిరుమల తిరుపతిలోని భక్తుల వసతి గదుల ధరలను తగ్గించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద బీజేపీ శ్రేణులు ధర్నా చేశాయి. సోము వీర్రాజు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది కలిగించేలా టీటీడీ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. అనంతరం బీజేపీ నాయకులు డీఆర్‌ఓ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బొమ్మల దత్తు, రొంగల గోపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబాను దర్శించుకున్న ప్రభాస్ శ్రీను

కడియం: దుళ్లలోని షిర్డీసాయిబాబా ఆలయాన్ని సినీనటుడు ప్రభాస్ శ్రీను గురువారం దర్శించుకున్నారు. పాలకొల్లులో జరిగే ఒక కార్యక్రమానికి హాజరైన శ్రీను దుళ్లలోని తన స్నేహితుడు కొండేటి శ్రీనివాసరావు (పెదబాబీ)ని కలుసుకునేందుకు వచ్చారు. సాయిబాబా ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల విషయం తెలుసుకుని ఆలయానికి వచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు కంటిపూడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. కాగా.. సాయిబాబా ఆలయంలో కంటిపూడి సత్యనారాయణ, తులసీరత్నం దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది.

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక

- 'గుడ్ మార్నింగ్' కార్యక్రమం భేష్
- రాజ్యసభ సభ్యుడు బోస్
- ఎంపీ భరత్‌రామ్‌తో కలసి పర్యటన



జగనన్న సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీలు సుభాష్ చంద్రబోస్, భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడేందుకు గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం చక్కని వేదికగా నిలుస్తుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. స్థానిక 15వ డివిజన్ సీతాజీయర్ హాస్పిటల్ సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి డివిజన్ ఇన్‌చార్జి ముత్యాల వీర అప్పారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటనకు ఇది ఒక మంచి కార్యక్రమమన్నారు. ఎంపీ భరత్ రామ్ ఉదయాన్నే పర్యటన నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిచ్చి రూ.లక్షల కోట్లు వెచ్చిస్తోందన్నారు. అవి సక్రమంగా లబ్ధిదారులకు అందుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడం, ఇంకా అర్హులుంటే వారిని గుర్తించి అందజేసేలా చర్యలు తీసుకోవడం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యత అన్నారు. ఒక వైపు లబ్ధిదారులను కలుసుకుంటూ మరోవైపు ఆయా డివిజన్లలో సమస్యలు, ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటున్నారన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటన

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనతో ప్రధానంగా డ్రెయినేజీ, నీటి సమస్యలు స్పష్టంగా తెలుస్తున్నాయన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. మున్సిపల్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించడానికి వీలవుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.

నేడు జగనన్న సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని నాగుల చెరువు మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో శుక్రవారం జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంఎఫ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ ,రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరితో కలసి జగనన్న సంక్రాంతి సంబరాలు పోస్టర్‌ను భరత్ రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా కారణంగా రెండేళ్లుగా పండగలు, వినోదాలకు చాలా దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. సంక్రాంతి పండగ అందరిలోనూ కొత్త ఆశలు, సంతోషాలు చిగురింపజేయాలని కోరుకుంటున్నానన్నారు. జగనన్న సంక్రాంతి సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, చిలక జోస్యం, కోలాటాలు, కోడి పుంజులు, పొట్టేళ్ల ఆటలు, గుర్రపు సవారీలు, పిండి వంటలు.. ఇలా ఎన్నోరకాలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళకు రంగవల్లులు, పురుషులకు పతంగుల పోటీలు నిర్వహిస్తామన్నారు. రంగవల్లుల పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పండగ పూటా అందరం కలిసి విందు భోజనం చేద్దామని, జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, కాంతారామ్ పాటిల్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి కార్మికుల సమస్యలు

రాజమహేంద్రవరం రూరల్: విజ్జేశ్వరం పవర్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. గురువారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో విజ్జేశ్వరం పవర్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఎంపీ భరత్‌ను కలిశారు. తమ సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి సంబంధిత యాజమాన్యంతో చర్చించాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అదే సమయంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ కూడా అక్కడే ఉండటంతో ఆయనకు కూడా విద్యుత్ పరిశ్రమ పరిస్థితిని వివరించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పవర్ ప్లాంట్ లేఆఫ్ కావడం వెనుక కారణాలు, వేతనాల పరిస్థితి తదితర అంశాలను సీఎం జగన్, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళతానన్నారు. అలాగే ఇండస్ట్రీ ప్రమోటర్‌తో కూడా మాట్లాడతానన్నారు. ఇండస్ట్రీ లేఆఫ్ అయింది కాబట్టి నిబంధనల ప్రకారం 50 శాతం వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎస్వీ శ్రీనివాస్, సాధనాల శివ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ అభినందనీయం



దుస్తులు పంపిణీ చేస్తున్న జక్కంపూడి రాజా, చిత్రంలో ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని వృద్ధులకు, వితంతువులకు జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ మీర్జా అలీ దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం సాయంత్రం కొంతమూరులో దుస్తులు పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు హాజరయ్యారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉపసర్పంచ్‌లు షేక్ మౌలాలీ, చెరుకూరి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ తాడేపల్లి గణేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్‌బాజీ బాషా, పరిమి దుర్గారావు, తాటికొండ విష్ణు పాల్గొన్నారు.

పీడీ కేసు నమోదు

రాజమహేంద్రవరం రూరల్: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కడియం మండలం బుర్రిలంకకు చెందిన నిశ్చనకోళ్ల వీరవేణిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ పిట్టా సోమశేఖర్ సూచనలతో పీడీ యాక్టు నమోదు చేసినట్టు సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపారు. ప్రస్తుతం ఆమె మహిళాజైలులో రిమాండ్‌లో ఉందన్నారు.

రాష్ట్రాన్ని దోచుకోవడమే వారి అజెండా

ధ్వజమెత్తిన ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రాన్ని, ప్రజలను నిలువునా దోచుకోవడమే చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ అజెండా అని ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ తన అభిమానులను గుత్తగా చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నాడన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికైనా ప్రజలు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. స్థిరత్వం, నిబద్ధత లేని ఆయనను ఏ విధంగా ప్రజలు నమ్మగలరని ప్రశ్నించారు. చంద్రబాబుకు పదవి పిచ్చి, ప్యాకేజీ స్టార్‌కు డబ్బు పిచ్చి అని, వీరిద్దరూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు తెలంగాణాలో మకాం పెట్టి.. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు చేస్తున్నారన్నారు. స్వార్థ రాజకీయాలు చేసే వీరి ఆటలు ఇకపై సాగకుండా ప్రజలే న్యాయ నిర్ణేతలై తగిన బుద్ధి చెప్పాలని ఎంపీ భరత్ రామ్ పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ అసలు ఏ పార్టీతో ఉంటారో ఈ రాష్ట్ర ప్రజలకు, కనీసం ఆయన పార్టీ నాయకులు, అభిమానులకైనా చెప్పాలని హితవు పలికారు.

స్టాంప్ అమ్మకందార్లపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు: జిల్లాలోని పలు రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని స్టాంప్స్ అమ్మకందార్లపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఎస్పీ పీవీ రవికుమార్ పర్యవేక్షణలో అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని కొవ్వూరు, రాజమహేంద్రవరం, రాజానగరం పరిధిలో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది స్టాంప్ అమ్మకందార్లు అధిక ధరలకు విక్రయం చేయడాన్ని గమనించారు. దీంతో వారి రికార్డులను సీజ్ చేసి, తదుపరి చర్యలపై సంబంధిత సబ్ రిజిస్ట్రార్లకు అప్పగించారు. తనిఖీల్లో డీఎస్పీ పి.ముత్యాల నాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, ఫారెస్ట్ రేంజ్ అధికారి వలీ, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ విజయకుమార్, జూనియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం వివేకానందుడు



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న స్వామి వినిశ్చలానంద తదితరులు



వివేకానందునికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎంఈవో లజపతిరాయ్

సీటీఆర్ఐ: స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శమని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం శాఖ కార్యదర్శి స్వామి వినిశ్చలానంద అన్నారు. కంబాలచెరువు వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ మఠం ప్రాంగణంలో 200 మంది విద్యార్థులతో యువజన సదస్సు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరానికి జాతీయ యువజన దినోత్సవ ప్రత్యేకత వికసిత్ యువ - వికసిత్ భారత్ అనే నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ జియోసైన్సెస్ విభాగాధిపతి నూకరత్నం, స్వామి రఘువీరానంద, స్వామి వేదవిద్యానంద పాల్గొన్నారు.

- వేదాంత విలువలను భారతదేశానికే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్ లాంటి ప్రపంచ దేశాలకు కూడా తన ఉపన్యాసాలు, వాదన ద్వారా పరిచయం చేసిన మహోన్నతుడు స్వామి వివేకానందుడు అని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీ సంజీవరావు అన్నారు. చేగువేరా విద్యార్థి యువజన సంఘం నిర్వహించిన వివేకానంద జయంతిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంఘం అధ్యక్షుడు బిల్డర్ బాబీ, కామర్స్ అధ్యాపకులు మేకల శివప్రసాద్, పేపకాయలు వీరబాబు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత

కడియం: స్వామి వివేకానందుడు యువతకు స్ఫూర్తి అని ఎంఈవో వి.లజపతిరాయ్ అన్నారు. వివేకానంద జయంతి, యువజనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎంఈవో మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జిలానీ, ఐసీడీఎస్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయం

ప్రకాశం నగర్: వివేకానందుడి జీవితం ఆదర్శనీయమని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు లంక సత్యనారాయణ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాల సదనంలో వివేకానంద జయంతి నిర్వహించారు. బాల సదనం విద్యార్థినులకు వస్త్రాలు, మిఠాయిలు, సంస్థ ప్రచురించిన స్వామి వివేకానంద చరిత్ర పుస్తకాలను పంచిపెట్టారు.

కార్డుదారులందరికీ నాణ్యమైన కందిపప్పు



కందిపప్పు వండి, నాణ్యతను పరిశీలిస్తున్న డీఎస్‌వో ప్రసాదరావు

సీటీఆర్ఐ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు నాణ్యమైన కందిపప్పు అందజేస్తున్నామని డీఎస్‌వో ప్రసాదరావు అన్నారు. గురువారం రాత్రి స్థానిక వీరభద్రపురంలోని సాధు స్త్రీల ఆశ్రమంలో నివాసం ఉంటున్న ఎం.పార్వతికి ఎండీయూ ద్వారా అందిస్తున్న కందిపప్పును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సబ్సిడీపై అందజేస్తున్న కందిపప్పుపై కొందరు అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.100ఉండే పప్పును, కేవలం రూ.67లకే అందజేస్తున్నామన్నారు. కందిపప్పును లబ్ధిదారు ఇంటి వద్ద వండగా కేవలం 5 నుంచి 7 నిమిషాల్లో ఉడికిందన్నారు. జిల్లా మేనేజర్ ఆర్.తనూజ మాట్లాడుతూ అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

శుభమస్తులో బంపర్ డ్రా



కారు బహుమతిగా అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని శుభమస్తు షాపింగ్ మాల్‌లో గురువారం డ్రా తీశారు. గుంటూరుకు చెందిన బి.అంకయ్య (కూపన్ నంబర్ 0083572) మారుతి కంపెనీ ఎస్‌ప్రెస్సో కారును గెలుపొందారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధరరావు (గిరి) డ్రా తీశారు. అంకయ్యకు మొదటి కారును మాల్ నిర్వాహకులు అందజేశారు.

మర్యాదపూర్వకంగా..



హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన వెంకట జ్యోతిర్మయిని అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కొలీజియం నిర్ణయం నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన పి.వెంకట జ్యోతిర్మయిని గురువారం కలెక్టర్ కె.మాధవీలత మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో న్యాయ సేవలు, న్యాయసేవాధికార సంస్థ చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాయన్నారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఉన్నారు.

గర్భస్థ లింగనిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: గర్భస్థ లింగనిర్ధారణ నేరమని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శిక్ష తప్పదని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఈ మేరకు గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం ఆవశ్యకతను వివరించారు. సమాజంలో ఇంకా లింగ వివక్ష చూపిస్తున్నారని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని భ్రూణహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని అరికట్టేందుకే ఈ చట్టం చేయబడిందన్నారు. దీని ప్రకారం ఆమోదం పొందిన సెంటర్లలో వైద్యులు మాత్రమే స్కానింగ్ చేయాలన్నారు. శిశువు ఆరోగ్యం, ఎదుగుదలను తెలుసుకొనేందుకు తప్ప మరే కారణం చేత స్కానింగ్ చేయకూడదన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి, చైల్డ్‌లైన్ కో డీఎంహెచ్‌వో కె.సుధాకర్, డాక్టర్ గీతశ్రీ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

రాజానగరం: విశాఖపట్నంలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2022-23లో రైట్ కళాశాల విద్యార్థి ఎం.మోహన కృష్ణ తృతీయ స్థానంలో నిలిచాడు. అండర్ 66 కేజీల విభాగం 85 కేజీల బరువును ఎత్తి, బ్రాంజ్ మెడల్ సాధించాడు. జనవరి 4 నుంచి 10 వరకూ జరిగిన ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కాగా.. మోహనకృష్ణను కళాశాల సెక్రటరీ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ అభినందించారు.

సంక్రాంతి పండగతో కొత్త వెలుగులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీలు సుభాష్ చంద్రబోస్, భరత్ రామ్



లలితానగర్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కొండలరావు



భోగిమంట వెలిగిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



రాజమహేంద్రి మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు

- ఎంపీలు బోస్, భరత్‌రామ్
- విజేతలకు బహుమతుల ప్రదానం

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. జగనన్న సంక్రాంతి సంబరాలలో భాగంగా పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలు డివిజన్లలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ నగరంలో అన్నిచోట్లా జగనన్న సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమాలలో రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, స్టేట్ బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, గుత్తుల మురళీధరరావు, సంకిస భవానీ ప్రియ, డాక్టర్ అనుసూరి పద్మలత, మజ్జి అప్పారావు, మజ్జి నూకరత్నం, ముప్పన ప్రభాకర్, రాయుడు గణేష్, చోడిశెట్టి సత్యవాణి, హసీనా బేగం, ఓంకార్ పాల్గొన్నారు.

లలితానగర్‌లో..

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లలితా నగర్ నామన ధనరాజ్ వీధిలో పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు పంతం కొండలరావు, నామన వాసు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు, గంగిరెద్దులు, హరిదాసులు, కొమ్మదాసులు, కోడిపందేలు, చెరకు గెడలు కట్టిన ఎడ్లబళ్లు, ముగ్గుల పోటీలు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. నరసింహారావు ఏర్పాటు చేసిన పాత నాణేల ప్రదర్శన, డాగ్ షో సందర్శకులను ఆకట్టుకుంది. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీనియర్ నాయకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, బీవీఎస్ రెడ్డి, బైర్రాజు ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రి మహిళా కళాశాలలో..

కంబాలచెరువు: స్థానిక రాజమహేంద్రి మహిళా కళాశాలలో సంక్రాంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఇంటర్‌బోర్డు ఆర్జేడీ ఐ.శారద, నన్నయ వర్సిటీ ఓఎస్‌డీ ఎస్.టీకే ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య, జి.లక్ష్మి, ప్రవీణ, కేఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

- తిలక్ రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో జరిగిన సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. గంగిరెద్దులు, హరిదాసు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐవీ.సుధాకర్, ఉషామాధురి, నాగమణి, కమల పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ

అనపర్తి: గ్రామంలోని పాతవూరిలో గత సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో సీతారామచంద్రస్వామికి లక్ష తులసి పూజ గురువారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు పెద్దింటి కృష్ణమాచార్యులు, వేదాంతం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదపండితులు వాడపల్లి వేణుగోపాలాచార్యులుతో పాటు ఋత్విక్‌లు పూజా కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువర్స్

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్‌కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్ ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ


పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబీ 4జీబీ ర్యామ్ 128జీబీ 6జీబీ ర్యామ్ 256జీబీ 8జీబీ ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

– 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

– దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

– బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

– దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.